క్లుప్తంగా

సురేష్‌కు ధన్యవాదాలు తెలిపిన పూసపాటి



సురేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న పూసపాటి మణికంఠేశ్వరరెడ్డి

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఐటీ వింగ్ జోనల్ అధ్యక్షుడు పూసపాటి మణికంఠేశ్వరరెడ్డి సోమవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు ధన్యవాదాలు తెలిపి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పూసపాటి మాట్లాడుతూ తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పూసపాటి వెంకట నరసారెడ్డి, వాకా వెంకట రామిరెడ్డి, రామకృష్ణ, శివకృష్ణ పాల్గొన్నారు.

పారదర్శకంగా జీవనోపాధుల ప్రణాళిక

కొండపి: స్వయం సహాయక సంఘ సభ్యులకు వార్షిక జీవనోపాదులు ఆర్థిక ప్రణాళికలు తయారు చేయాలని ఏపీఎం బి. గోపీనాథ్ అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో కొండపి, పెద్దకండ్లగుంట, జాళ్లపాలెం, కట్టవారిపాలెం పెరిదేపి, మిట్టపాలెం పంచాయతీలోని ఎన్యుమరేటర్లకు శిక్షణ నిర్వహించారు. డ్వాక్రా గ్రూపు సభ్యురాలు నుంచి కచ్చితమైన సమాచారాన్ని సేకరించాలన్నారు. సేకరించిన సమాచారాన్ని ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. సీసీలు డి. మల్లికార్జున, సీహెచ్. గోవిందమ్మ, కె.రామానుజులు, కె.రమణమ్మ, అకౌంటెంట్ కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.


చెన్నారెడ్డి భౌతికకాయానికి నివాళి



నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణయాదవ్

వెలిగండ్ల.(కనిగిరిరూరల్): మండలంలోని మరపగుంట్లలో అనారోగ్యంతో మృతి చెందిన కేలం బాల చెన్నారెడ్డి భౌతికకాయాన్ని సోమవారం వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పొల్లా సుబ్రహ్మణం, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి కటికల వెంకటరత్నం, తాతపుడి సురేష్, ఎలికా రమణయ్య, కుప్పనబోయిన వెంకట రమణయ్య, సర్పంచ్‌లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

ప్లాంట్ శంకుస్థాపన పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

పీసీపల్లి: మండలంలోని దివాకరపురం సమీపంలో బయోగ్యాస్ ప్లాంట్ శంకుస్థాపన పనులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏప్రిల్ 2 న రాష్ట్రంలో తొలి సీబీజీ ప్లాంట్‌కి శంకుస్థాపన చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే మార్కాపురం, గిద్దలూరు, దర్శిల్లో సీబీసీ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్లాంట్ల ఏర్పాటుతో వలసలు తగ్గి స్థానికులకు ఉపాధి దొరుకుతుందన్నారు. ఎమ్మెల్యే ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలు

కనిగిరిరూరల్: ఘర్షణలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూడు రోజుల క్రితం సాదిక్ అనే యువకుడు బైక్‌ను వేగంగా నడుపుతాడు. దాన్ని బస్టాండ్‌లో హోటల్ బండి వద్ద ఉన్న షఫీ .. ఎందుకు బైక్ అంతా స్పీడ్‌గా నడుపుతావ్...బైక్ తగిలితే ప్రమాదం జరుగుతుందని చెప్తాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరుగుతుంది. సాదిక్ ఈ విషయాన్ని ఇంటి దగ్గరకెళ్లి అతని తాత నూర్ వలికి, బంధువులకు చెప్తాడు. దీంతో ఇద్దరి ఇంటి వద్ద గొడవ జరుగుతుంది. ఈ క్రమంలో సాదిక్ బంధువైన ఖాశిం.. ఆదివారం షఫీ అన్న కుమారుడు అఫ్రోజ్‌ను దూషిస్తాడు. దీంతో షఫీ, అఫ్రోజ్ మరికొందరు కలిసి పాదిలి రోడ్డులోని టీ కొట్టు వద్ద ఉన్న ఖాశింపై దాడి చేసి కొట్టి తీవ్రంగా గాయపరుస్తారు. ఖాశింకు తల పగిలి తీవ్ర రక్తస్రావం అవుతుంది. విషయం తెలుసుకున్న ఇరువర్గాలు మోహరించడంతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తతగా మారుతుండటంతో పోలీసులు రంగ ప్రవేశం గుంపును చెదరగొట్టారు. ఖాశీం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుని ఫిర్యాదు మేరకు షఫీ, అఫ్రోజ్, సందాని, మరి కొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.శ్రీరాం తెలిపారు.



కొణిజేడు కొండల మధ్య తారురోడ్డులో పెద్ద పెద్ద గుంతలు



లారీలతో గ్రావెల్ తరలింపుతో కొణిజేడు వద్ద గుంతలు పడిన తారురోడ్డు



మర్లపాడు కొండల వద్ద ధ్వంసమైన తారురోడ్డు



కొణిజేడు వద్ద గ్రావెల్ తరలిస్తున్న లారీ

గ్రావెల్ తరలిస్తూ..రోడ్లు ధ్వంసం చేస్తూ..

- గ్రావెల్ అక్రమ తరలింపుతో పెద్ద పెద్ద గుంతలుగా మారిన తారు రోడ్లు
- గుంతల్లో జారిపడి తరచూ ప్రమాదాలు
- నరకప్రాయంగా ప్రయాణం
- మంత్రి స్వామి ఇలాకాలో వాహనచోదకుల ఇక్కట్లు

టంగుటూరు: 'సంక్రాంతికి మీ ఊరికి వెళ్లేటప్పుడు రోడ్లు ఎలా ఉన్నాయో చూడండి..' అని సీఎం చంద్రబాబు చెప్పిన మాటలు రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ గ్రామాల్లో రోడ్లు దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయి. మండలంలోని మర్లపాడు యర్రజర్ల, కొణిజేడు గ్రామ కొండల ప్రాంతాల నుంచి రోజూ వందల సంఖ్యలో లారీల ద్వారా అక్రమంగా గ్రావెల్ తరలుతోంది. దీంతో ప్రధాన రహదారి తారురోడ్లు ధ్వంసమై గుంతలు పడి ప్రమాదకరంగా మారింది.

విచ్చలవిడిగా గ్రావెల్ తరలింపు..

కూటమి ప్రభుత్వం వచ్చిన తొమ్మిది నెలలు నుంచి మండలంలోని ఈ మూడు గ్రామాల కొండల ప్రాంతం నుంచి యథేచ్ఛగా రేయింబవళ్లు గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారు. ఇష్టారీతిన సాగుతున్న ఈ తవ్వకాలు, తరలింపులతో రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. నిత్యం గ్రావెల్ తరలింపు లారీలు ప్రమాదకరంగా తిరుగుతుండటంతో స్థానిక గ్రామస్తులు హడలిపోతున్నారు. ఈ మూడు గ్రామాల కొండల ప్రాంతం గుండా నిత్యం ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు, బైక్లు, ఆటోలు, ఇతర వాహనాలు ప్రయాణం సాగిస్తుంటాయి. అసలే కొండల ప్రాంతం మలుపులు కావటంతో వాహన చోదకులు ఈ గుంతల్లో జారిపడి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ ప్రాంతంలో రాత్రిళ్లు ప్రయాణం చేయాలంటే వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

నూతన రహదారికి మోక్షం ఎప్పుడో?

మర్లపాడు బస్టాండ్ నుంచి కొండల మీదుగా ఒంగోలుకు వెళ్లే పంచాయతీరాజ్ పరిధిలోని 1.6 కిలోమీటర్ల మట్టి రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ మార్గం నుంచి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణం సాగిస్తుంటారు. సుదీర్ఘంగా మద్రిపూడి, జాళ్లపాలెం, కొండపి దూర ప్రాంతాల ప్రజలు, ఒంగోలు వెళ్లాలంటే ఈ మార్గం ఎంతో అనువుగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో గ్రావెల్ తవ్వకాల తరలింపుతో ఈ 1.6 కిలోమీటర్ల మట్టి రోడ్డు పెద్ద పెద్ద గొంతులో ఏర్పడి ప్రమాదకరంగా మారటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు . ఈ మార్గాన వాహన చోదకులు జారిపడి పలు ప్రమాదాలు సైతం జరిగాయి. ఈ రహదారి నిర్మాణం గురించి అధికారులకు పలు మార్లు తెలియజేసినా పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. మంత్రి స్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ మండలంలో రోడ్ల దుస్థితి ఈ విధంగా ఉన్నా ఏనాడు పట్టించుకోలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రమాదాలుజరగకుండా చూడాలని కోరుతున్నారు.

బుర్రాను కలిసిన మర్లపాటి



బుర్రాను సత్కరిస్తున్న మర్లపాటి అదామ్, కార్యకర్తలు

కందుకూరు రూరల్: పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షునిగా నియమితులైన మర్లపాటి ఆదామ్ సోమవారం కందుకూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి బుర్రా మధుసూధన్ యాదవ్‌ను కలిశారు. ఈ పదవికి ఎంపిక చేయడంపై బుర్రాకు కృతజ్ఞతలు తెలియజేశారు. నాపై నమ్మకంతో పదవిని ఇచ్చినందుకు న్యాయం చేస్తానన్నారు. ఈ సందర్భంగా బుర్రాను ఘనంగా సత్కరించారు.

విద్యార్థి చికిత్సకు ఆర్థికసాయం

కొండపి: మండలంలోని కట్టావారిపాలెం బీసీ కాలనీకి చెందిన విద్యార్థి తన్నీరు అచ్యుత్‌కుమార్ చికిత్స నిమిత్తం గ్రామానికి చెందిన మామిళ్లపల్లి నరసింగరావు కుటుంబసభ్యులు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. దాత కుటుంబ సభ్యులు విజయలక్ష్మి, హర్షవర్ధిని, విష్ణువర్ధిని, ఆరికట్ల రాంప్రసాద్, వేదాన్స్ సాయి, ఆరికట్ల రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పవిత్ర రంజాన్

- ఈద్గా వద్ద రంజాన్ ప్రత్యేక నమాజులు
- కిటకిటలాడిన ఈద్గాలు, మసీదులు
- వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



సింగరాయకొండ: రంజాన్ ప్రత్యేక నమాజులో మాజీ మంత్రి ఆదిమూలపు



మున్ని హజరత్‌కు ఈద్ ముబారక్ చెప్తున్న చైర్మన్ అబ్దుల్‌గఫార్, ముస్లింలు



పొన్నలూరులో ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



లింగసముద్రంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కనిగిరిరూరల్: ముస్లిం సోదరుల అతిముఖ్యమైన పండుగ రంజాన్ (ఈద్–ఉల్–ఫితర్) ను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముప్పై రోజుల కఠిన ఉపవాస దీక్షల అనంతరం నిర్వహించుకునే రంజాన్ పండుగ అత్యంత వైభంగా జరిగింది. వేకువజామునే లేచి కాలకృత్యాలు తీర్చుకుని, కొత్త దుస్తువులు ధరించి మసీదుల వద్దకు చేరారు. పట్టణంలోని ముస్లిం సోదరులంతా స్థానిక దర్గా మసీద్(ఛోటీ మసీద్) వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి అల్లాహు అక్బర్..అల్లా హు అక్బర్. లాయిలాహ ఇల్లేల్లాహు. అల్లాహు అక్బర్..వల్లిల్లా ఇలహం అనే తక్బీర్ చదువుతూ కనిగిరి పెద చెరువు వద్ద ఉన్న ఈద్గా వద్దకు వెళ్లారు. ఈద్గా ప్రాంగణం కిటకిటలాడింది. ఈ సందర్భంగా మౌలాన మహమ్మద్ అలీ బయాన్ చేశారు.ప్రవక్త చూపిన సత్ మార్గాలు, తోటి వారికి సహాయం చేయాలనే సేవాగుణం, రంజాన్ విశిష్టత, ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం ఈద్గాలో మౌలాన మమహ్మద్ అలీ (మత గురువు) రంజాన్ ప్రత్యేక నమాజును చదివించారు. ఈ సందర్భంగా మౌలాన మహమ్మద్ అలీ ఎంతో నియమనిష్టలతో 'దువా' చేశారు. ప్రత్యేక నమాజు అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ (రంజాన్ శుభాకాంక్షలు) తెలుపుకున్నారు. ప్రత్యేక నమాజుల్లో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నర సింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే అహమ్మద్ బాష, మాజీ అంజుమన్ కమిటీ అధ్యక్షుడు రోషన్ సందాని, ఎస్‌కే లతీఫ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే చిన మస్తాన్ వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఆధ్వర్యంలో, మాజీ మున్సిపల్ చైర్మన్ చిన మస్తాన్ ఆధ్వర్యంలో, అంజుమన్ కమిటీ అధ్వర్యంలలో వేర్వేరు ప్రాంతాల్లో ఈద్గా ప్రత్యేక ప్రార్థనలకు వచ్చిన ముస్లింల దాహార్తి తీర్చేందుకు ఉచిత కూల్ వాటర్, కూల్‌డ్రింగ్స్ వేర్వేరుగా ఏర్పాటు చేశారు.

నల్లరిబ్బన్లు ధరించిన ముస్లింలు..

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వక్ఫ్ సవరణ బిల్లును నిరసిస్తూ ముస్లింలు నల్లబ్యాడ్జి, రిబ్బన్ ధరించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ఈద్గ మిట్ట దర్గా వద్ద సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా జరిగిన ప్రార్థనల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు. తరువాత ముస్లిం సోదరులకు సురేష్ శుభాకాంక్షలు తెలిపి వారిని ఆలింగనం చేసుకున్నారు. తరువాత పార్టీ కార్యాలయంలో ముస్లిం సోదరులు సురేష్‌ను కలుసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పఠాన్ రియాజ్, జిల్లా అధ్యక్షుడు షేక్ సుల్తాన్, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సలీం, మహిళా అధ్యక్షురాలు యనమల మాధవి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా కిరణ్‌కుమార్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు గాదంశెట్టి గుప్తా, రాపూరి ప్రభావతి, షేక్ కరీం, బుజ్జమ్మ, ఎంపీటీసీ గోళ్లమూడి అశోక్‌రెడ్డి, ఉప సర్పంచ్ బల్లెల ప్రభాకరరెడ్డి, షేక్ నౌషాద్, షేక్ జానీబాషా, షేక్ అబ్దుల్లా పాల్గొన్నారు.

కొండపి: పవిత్రతకు, త్యాగానికి, మతసామరస్యానికి రంజాన్ ప్రతీక అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకొని స్థానిక ఈద్గాలో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

టంగుటూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఫైర్‌స్టేషన్ వద్ద ఉన్న ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింసోదరులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ముస్లింలు పేదలకు మిఠాయిలు, దానధర్మాలు చేశారు.

పామూరు: పవిత్ర రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక సీఎస్‌పురం రోడ్డులోని ఈద్గా మైదానానికి పామూరుకు చెందిన ముస్లింలతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలు అత్యధిక సంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్, పార్టీ పట్టణఅధ్యక్షుడు షేక్.సెంట్రింగ్ చాంద్‌బాషా, కోఆప్షన్ సభ్యుడు షేక్.నాయబ్‌రసూల్, ఎంపీటీసీ షేక్.అబ్దుల్, మైనారిటీసెల్ నాయకులు షేక్.గయాజ్, షేక్.ఖాదర్‌బాషా, షేక్.బారాషరీఫ్, ఎంఏటీ నాయబ్‌రసూల్, షేక్.షంషూర్, షేక్.హాజీగౌస్, కోఆప్షన్ మాజీ సభ్యులు ఖాదర్‌మొహిద్దీన్, ముస్లింలు పాల్గొన్నారు.

పొన్నలూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజుల నుంచి నిష్టతో కొనసాగించిన కఠిన ఉపవాస దీక్షలను ఆదివారంతో విరమించారు. ప్రతి ఒక్కరు నూతన వస్త్రాలు ధరించి తెల్లవారుజాము నుంచే ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రంజాన్ సందర్భంగా మసీదు ప్రాంతంలో పేదలకు స్వీట్లు పంచారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలో రంజాన్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక డీజీపేట రోడ్డులోని ఈద్గా మైదానానికి సీఎస్‌పురానికి చెందిన ముస్లింలతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలు అత్యధిక సంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం ముస్లిం మతపెద్దలు ఇస్లాం, రంజాన్‌పర్వదిన ప్రాముఖ్యాన్ని వివరించారు. ముస్లిం సోదరుల ప్రార్థనలతో ఈద్గా ప్రాంతం జనసంద్రంతో కిక్కిరిసిపోయింది. పలువురు ముస్లింలు పేదలకు ఆర్థిక సాయం చేశారు. ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బుజ్జి, కోఆప్షన్ సభ్యులు పఠాన్ మహబు, డాక్టర్ షేక్.గౌస్ పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: మండలంలో రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాలిచర్ల, హనుమంతునిపాడు, నందనవనం, ఉమ్మనపల్లి, కొండారెడ్డిపల్లి, జమాన్‌ఖాన్‌పల్లి, వీరరాంపురం , తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పేదలకు దాన ధర్మాలు చేశారు.

కందుకూరు రూరల్: పట్టణ, మండలంలో రంజాన్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. నెల రోజుల పాటు నియమనిష్టలతో ఆచరించిన కఠోర ఉపవాస దీక్షలకు ముగింపు పలికి రంజాన్ పండుగ జరుపుకున్నారు. కందుకూరు పట్టణంలో కోటకట్ట రోడ్డులోని ఈద్గా, పెద్ద మసీదు ఈద్గా, గుండంకట్ట ఈద్గా, జనార్ధన కాలనీల్లో ఉన్న ఈద్గాల వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలకు అధిక సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. ఒకరికొకరు అలింగడం చేసుకుంటూ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పేదలకు దానధర్మాలు చేశారు. కందుకూరు మండలంలోని విక్కిరాలపేట, శ్యామీరపాలెం, కొండముడుసుపాలెం గ్రామాల్లో రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు నల్ల బాడ్జీలు ధరించి ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ బిల్లును ఆమోదిస్తే ముస్లిం సమాజానికి తీవ్ర నష్టంతోపాటు రాజ్యాంగం ప్రసాధించిన హక్కులను హరించినట్టు అవుతుందని పలువురు ముస్లిం పెద్దలు తెలిపారు.

ఉలవపాడు: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక ఈద్గామిట్ట, కరేడు, రామాయపట్నం మసీద్ లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మౌలానాలు, ప్రవక్తలు మాట్లాడుతూ అల్లాదయ,. కృప కరుణ సర్వమానవాళిపై సమంగా ప్రసరించాలన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

లింగసముద్రం: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని లింగసముద్రం, పెదపవని, చినపవని, చీమలపెంట, మొగిలిచర్ల, మేదరమిట్లపాలెం తదితర గ్రామాల్లో ఈద్గా మసీదుల వద్ద సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వలేటివారిపాలెం: మండలంలోని చుండి, వలేటివారిపాలెం, కళవళ్ల, కొండసముద్రం గ్రామాల్లో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లిం సోదరులు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



కందుకూరులో ఈద్గా వద్ద నల్ల బ్యాడ్జీలతో ముస్లింలు



ముస్లింలతో కలిసి నమాజ్ చేస్తున్న మంత్రి స్వామి



టంగుటూరులో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు



ఈద్గా వద్ద బయాన్ చేస్తున్న మౌలాన



సీఎస్‌పురం ఈద్గావద్ద ప్రత్యేక ప్రార్థనలు



పామూరులో ఈద్గావద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



ఉలవపాడు ఈద్గా మిట్ట వద్ద రంజాన్ ప్రార్థనలు

పిచ్చమ్మ దశదిన కర్మలో నేతలు

కనిగిరిరూరల్: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తల్లి యర్రం పిచ్చమ్మ దశదిన కర్మలో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు బుర్రా మధుసూదన్ యాదవ్, కదిరి బాబురావు, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి వేర్వేరుగా పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, చప్పిడి సుబ్బయ్య, పార్టీ మండల అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ గాయం సావిత్రి, ఎక్కంటి శ్రీనివాసులరెడ్డి, గాయం బలరాంరెడ్డి, కటికల వెంకట రత్నం, డాక్టర్ ఆవుల కృష్టారెడ్డి, జి. ఆదినారాయణరెడ్డి, స్వర్ణ ఏడుకొండలురెడ్డి, కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడి దాదిరెడ్డి మాలకొండారెడ్డి, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, సంగటి మహేంద్రారెడ్డి, ఇండ్లా శ్రీకాంత్, సానికొమ్మ వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ బ్రహ్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





యర్రం పిచ్చమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బుర్రా, దద్దాల నారాయణ యాదవ్, నేతలు

అందరూ సంతోషంగా ఉండాలి



రంజాన్ తోఫా అందజేస్తున్న కేశవరపు జాలిరెడ్డి

ఉలవపాడు: రంజాన్ పండుగ రోజు అందరూ సంతోషంగా ఉండాలని, అందుకే ముస్లింలకు రంజాన్ తోఫా అందిస్తున్నట్లు వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కరేడులో సుమారు 60 కుటుంబాలకు సోమవారం ఆయన తోఫా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ పండుగ రోజు అందరూ సంతోషంగా ఉండాలని, ఆర్థికపరమైన ఇబ్బందులు పండుగ రోజు ఏ కుటుంబానికి ఉండకూడదనే ఉద్దేశంతో పండుగ రోజు అవసరమైన మాంసం, నిత్యావసరాలు కలిపి తోఫా అందిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ సుందరమ్మ, మాజీ సర్పంచ్ కొక్కిలగడ్డకృష్ణారావు, షేక్‌వలి, ఖాజా, రామకృష్ణ, బ్రహ్మేశ్వరరావు, శరభారెడ్డి, సుబ్బారెడ్డి, మహీధరరెడ్డి, కోటేశ్వరరావు, రామనాథం, మాల్యాద్రి, జాలయ్య , ఏడుకొండలు పాల్గొన్నారు.

